క్లుప్తంగా

వాయుపుత్రుడికి విశేష పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుడుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున అర్చకులు స్వామి వారికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు. అలాగే స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎర్రవంక వాగులో పూడికతీత పనులు



వాగులో పూడికను తొలగిస్తున్న జేసీబీ

ఆదోనిటౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎర్ర వంక వాగులో పూడికతీత పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. కొద్ది రోజులుగా కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు బెడద ఎక్కువై స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ రామచంద్రారెడ్డి పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో అధికారులు సత్వరమే పనులను ప్రారంభించారు. వంకకు అటు ఇటు రెండువైపులా ఉన్న ముళ్లపొదలు, చెట్లు తొలగించారు. కాలువలోని పూడికను ఎత్తివేస్తున్నారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద రూ.9.80 లక్షలు పూడికతీత పనులకు ఖర్చు చేస్తున్నారు. దీనిపై ఆయా ప్రాంతాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నేడు ప్రవేశ పరీక్ష

ఆదోనిసెంట్రల్: ఆరేకల్ గ్రామంలోని బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశ పరీక్షలు ఆదివారం జరుగుతాయని ప్రిన్సిపల్ సునీత తెలిపారు. 5వ తరగతిలో 1,398, ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్షలకు 567 మంది దరఖాస్తులు చేసుకున్నారని వెల్లడించారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటల కల్లా సెంటర్‌కు చేరుకోవాలన్నారు.

ఆదోనిలో పోలీసుల కవాతు



డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసుల కవాతు

ఆదోనిఅర్బన్/ఆదోని రూరల్: ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో శనివారం ఆదోని పట్టణంలో కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెంట్రల్ ఫోర్స్ (ఎస్ఎస్‌బీ), ఆదోని పోలీసు బలగాలు పట్టణంలోని స్టేట్ బ్యాంక్, భీమాస్ సర్కిల్, జైన్ టెంపుల్, మీర్ మహ్మద్‌షా వలి దర్గా, బాబుప్లాజా సర్కిల్, ఆర్ఆర్ జంక్షన్ సర్కిల్, పెద్ద మసీదు, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, హాజీపూర్ ఓల్డ్ పోస్ట్ ఆఫీసు, బొబ్బులమ్మ గుడి, చౌదరిబాయి, గణేష్ సర్కిల్, హవన్నపేట జంక్షన్, కొడల్ పేట్, తిక్కస్వామిదర్గా, పోలీసు కంట్రోల్ రూమ్, చందసా దర్గా మీదుగా టూ టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికలు సక్రమంగా జరిగేలా పోలీసుశాఖ గట్టి చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సీఐలు తేజమూర్తి, గోపీచంద్, నరసింహరాజు, ఎస్ఐలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అలసందగుత్తి, దిబ్బనకల్ గ్రామాల్లో రూట్ మార్చ్ నిర్వహించినట్లు సీఐ నిరంజన్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు.

కబడ్డీ విజేత అలసందుగుత్తి



నగదు బహుమతి అందజేస్తున్న చంద్రశేఖర్

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామంలో శ్రీగిరి పంచలింగేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఆదోని మండలం అలసందుగుత్తి జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.15,016 వేలు, రెండో బహుమతి బిణిగేరి జట్టుకు రూ.7,016 వేలను వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి తనయుడు బుసినె చంద్రశేఖర్ అందజేశారు. అంతకు ముందు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నరెడ్డి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం

- మండలంలో జోరుగా అభివృద్ధి పనులు
- ఈనెల 11న ప్రారంభించనున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి



డి.బెళగల్‌లో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



పెద్దభూంపల్లి ప్రారంభానికి సిద్ధమైన సచివాలయ భవనం



సాతనూరులో నిర్మాణం పూర్తయిన రైతుభరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్



పల్లెపాడులో ముస్తాబయిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

కోసిగి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పల్లెలు ప్రగతి బాటలో పయనిస్తున్నాయి. గ్రామాల్లోనే పాలన సేవలన్నీ అందించాలని సచివాలయ కార్యాలయాలు శ్రీకారం చుట్టారు. రైతులకు వ్యవసాయ సేవలందించేందుకు ఆర్బీకేలు, ప్రజలకు ఆరోగ్య సేవలందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మండలంలో 19 సచివాలయాలు, 16 రైతు భరోసా కేంద్రాలు, 14 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు చేపట్టారు. సచివాలయాల నిర్మాణానికి రూ.40.50 లక్షలు, రైతుభరోసా కేంద్రాలకు రూ.21.50 లక్షలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు రూ.17.80లక్షలు చొప్పును నిధులు కేటాయించడంతో పనులు చేపట్టారు. ఇప్పటికే కోసిగి సచివాలయం-4, దుద్ది, వందగల్లు, చింతకుంట, సజ్జలగూడెం గ్రామాల్లో రైతు భరోసా, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. మరికొన్ని ప్రారంభానికి సిద్ధం కాగా, ఇంకొన్ని నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి.

రేపు ప్రారంభం..

పెద్ద భూంపల్లి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డి.బెళగల్‌లో రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పూర్తి కావడంతో ఈనెల 11వ తేదీన ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రారంభించనున్నారు.అలాగే పల్లెపాడు గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రంథాలయం, రూ.2.14 కోట్లు నాబార్డు నిధులతో నిర్మించిన బాలుర ఉన్నత పాఠశాల అదనపు గదులు, సాతనూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించనున్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

కోసిగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, నారాయణ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర పరీక్షలను శనివారం సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. మాథ్స్, జువాలజీ, హిస్టరీ పరీక్షలు జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 221 మంది విద్యార్థులకు గానూ 120 మంది హాజరు కాగా, 101 మంది గైర్హాజరైనట్లు కళాశాల పరీక్ష చీఫ్ శ్రీనివాసులు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రాఘవేంద్ర తెలిపారు. నారాయణ కళాశాలలో 221 మందికి గానూ 211 మంది హాజరయ్యారని పరీక్షల చీఫ్ ఉదయ్‌భార్గవ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రంగన్న తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో సిట్టింగ్ స్క్వాడ్ నాగేష్, నారాయణ కళాశాలలో పరమేశ్వర రెడ్డి పరిశీలించారు.

మద్యం విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: ఆస్పరి మండలం తురువగల్ గ్రామానికి చెందిన నరసప్ప కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి శనివారం తెలిపారు. తురువగల్ గ్రామం నుంచి మద్యం తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. అతని వద్ద నుంచి 90ఎంఎల్ పరిమాణం గల 40 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మైక్రో ఫిల్టర్‌బెడ్స్ ఏర్పాటుకు భూమిపూజ



పనులు ప్రారంభించిన వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: మండల కేంద్రం వాసులకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రత్యేక నిధులతో ముమ్మరంగా పనులు చేయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక భూగేని చెరువు సమీపంలో రంగప్ప గట్టు వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు రూ.10 లక్షలతో మైక్రో ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటుకు మండల నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇదివరకే భూగేని చెరువును తాగునీటి స్టోరేజ్ నిమిత్తం రూ.40 లక్షలతో రూపొందించి పైప్‌లైన్ వేసి సిద్ధం చేశారన్నారు. తుంగభద్ర నదిలో నీళ్లు తగ్గిపోవడంతో పులికనుమ రిజర్వాయర్‌కు నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా పులికనుమ రిజర్వాయర్‌లోని నీటిని పైప్‌లైన్ వేసి స్టోరేజీ ట్యాంక్‌కు సరఫరా చేపట్టామన్నారు. ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా నాయకులు ఇల్లూరి ఆదినారాయణ, నాడుగేని వీరేష్, మాణిక్యరాజు, జగదీష్ స్వామి, కోసిగయ్య, బుళ్లి నరసింహులు, బసిరెడ్డి, ఎరుకల లక్ష్మన్న, కాంట్రాక్టర్ నాగరాజు, రాజేష్, అయ్యప్ప పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపై అప్రమత్తత అవసరం

ఆదోని సెంట్రల్: రేబిస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ పీవీ రమణ అన్నారు. కుక్కకు రేబిస్ వ్యాధి ఉందో లేదో తెలయని కనుక కుక్క కాటుకు గురైతే తప్పకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. టీకాకు ముందు కరిచిన ప్రాంతాన్ని శుభ్రం చేయాలన్నారు. టీకాలను మొదటి రోజు, మూడో రోజు, ఐదో రోజు, ఏడో రోజు, 14వ రోజు ఇలా 5 ఇంజెక్షన్లను వేసుకోవాల్సి ఉంటుందన్నారు. తరువాత 30 రోజులకు 90 రోజులకు కూడా కుక్క కాటు ఇంజెక్షన్ వేసుకుంటే మంచిదని తెలిపారు. ఒక వేళ నిర్లక్ష్యం వహిస్తే ప్రాణపాయ స్థితికి చేరుకునే అవకాశం ఉందన్నారు. కుక్కల విషయంలో జాగ్రతలు తీసుకోవాలని తెలిపారు. పెంపుడు కుక్కలకు 6 నెలలకు ఒకసారి వ్యాధుల నివారణకు సంబంధించిన టీకాలను వేయిస్తే మంచిదన్నారు. అస్పత్రిలో ఉచితంగా టీకాలు వేస్తారని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యక్తిగత ఘర్షణలను పార్టీపై రుద్దడం సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకులు

ఆదోనిరూరల్: మండలంలోని నాగనాథనహళ్లిలో మహిళపై జరిగిన దాడి వ్యక్తిగతమని.. అయితే కొందరు దీన్ని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీపై రుద్దుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని ఆ పార్టీ ఎస్సీ సెల్ విభాగం టౌన్ అధ్యక్షుడు చలపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, ఆదోని పట్టణాధ్యక్షుడు దేవా అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం నాగనాథనహళ్లి గ్రామంలో ఘర్షణ జరిగిందన్నారు. ఇందులో పురుషోత్తం రెడ్డి అనే వ్యక్తి దాడి విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. గాయపడిన మహిళకు న్యాయం చేయాలని తాము కోరుతున్నామని చెప్పారు. వ్యక్తిగత గొడవలను వైఎస్సార్‌సీపీపై, ఎమ్మెల్యేపై రుద్దడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఆదోని ఎమ్మెల్యే గొడవలను ప్రోత్సహించరని, శాంతియుతంగా ఉండాలన్నదే ఆయన అభిమతమని చెప్పారు. కావాలనే టీడీపీ నాయకులు ఈ విషయాన్ని రాజకీయం చేస్తున్నారన్నారు. ఇకనైనా వాస్తవాలు ఏమిటో తెలుసుకోవాలని సూచించారు. ఎస్సీ విభాగం నాయకులు గంగాధర్, తాయన్న, హనుమంతు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణికి పరీక్షిస్తున్న వైద్యురాలు



తల్లీబిడ్డ ఆరోగ్యంపై సూచనలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆదోనిటౌన్: తల్లీ బిడ్డల ఆరోగ్యమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని మాతా శిశుసంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీలత అన్నారు. శనివారం ఆస్పత్రి నూతన భవనంలో డాక్టర్‌లు భాగ్యలక్ష్మి, సుజాత, మమత, హేమకిరణ్, పర్వాన్ గర్భిణులకు స్కానింగ్, బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. డివిజన్ పరిధిలోని 366 మంది గర్భిణులు పరీక్షలు చేయించుకున్నారు. ప్రధాన్ మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా 9వ తేదీ గర్భిణులకు ప్రత్యేకంగా పరీక్షలు, స్కానింగ్ చేస్తామన్నారు. అనంతరం ఆరోర్య సూత్రాలను వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

పుచ్చకాయలకు భలే గిరాకీ



కోసిగి వైఎస్సార్ సర్కిల్‌లో అమ్మకానికి ఉంచిన పుచ్చకాయలు

కోసిగి: ఎండలు రోజు రోజుకు ముదురుతున్నాయి. దీంతో ప్రజలు చల్లటి పానీయాలు, పండ్లు కొనుగోలు చేసుందుకు ఆసక్తి చూపుతున్నారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో హనుమంతు అనే వ్యాపారి వైఎస్సార్ జిల్లా నుంచి పుచ్చకాయలు (కలింగర) కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. ఈ కాలంలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు పుచ్చకాయలను కొనుగోలు చేసేందుకు చాలా మంది ఇష్టపడ్డారు. ప్రస్తుతం కిలో రూ.25 చొప్పున విక్రయిస్తున్నానని, ఒక్కో పుచ్చకాయం 6 -10 కేజీల వరకు ఉంటుందని చెబుతున్నాడు. మార్చి, ఏప్రిల్, మే, జూన్ మొదటి వారం లోపు దాదాపు 100 టన్నుల మేర అమ్మకాలు చేస్తానని చెబుతున్నాడు. తాను కిలో రూ.18 ప్రకారం కొనుగోలు చేస్తానని, రవాణా చార్జీ రూ.2, కూలీల ఖర్చులు రూ.2 పోనూ.. కిలో రూ.25 చొప్పున అమ్మకాలు సాగిస్తున్నానని చెప్పాడు. దాదాపు 18 ఏళ్లుగా ఈ వ్యాపారం చేసి జీవనం సాగిస్తున్నానని వివరించాడు.



పుచ్చకాయలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

కనులపండవగా రథోత్సవం



దొడ్డిమేకలలో భక్త జనుల మధ్య రథోత్సవం

పెద్దకడబూరు: మండలంలోని దొడ్డిమేకల, హెచ్.మురవణి గ్రామాలు హర హర మహాదేవ.. శంభో శంకర అనే శివనామ స్మరణతో మార్మోగాయి. దొడ్డిమేకలలోని ఈశ్వరాలయంలో వెలసిన చంద్రమౌళేశ్వరస్వామి, హెచ్.మురవణిలో ఉమామహేశ్వరస్వామి రథోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల అర్చకులు వీరభద్రయ్యస్వామి, వీరయ్యస్వామి, వీరేష్‌స్వామి, భూషన్నస్వామి తెల్లవారుజాము నుంచి కుంకుమాభిషేకం, పుష్పాభిషేకం, పాలాభిషేకం, విభూతి అభిషేకం, గంధాభిషేకం, జలభిషేకం, పంచామృతాభిషేకం, మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. దొడ్డిమేకలలో చంద్రమౌళేశ్వరస్వామికి కల్యాణోత్సవం జరిపించారు. గ్రామస్తులు పిండి వంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం దొడ్డిమేకలలో గజ్జహళ్లి వెంకటరామిరెడ్డి ఇంటి నుంచి, హెచ్.మురవణి గ్రామంలో జంగం భూషయ్య ఇంటినుంచి కుంభాలు రథం దగ్గరికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాముల వారి ఉత్సవమూర్తులను రథంపైకి అధిరోహించి మంగళవాయిద్యాల నడుమ, మహిళలు కళశాలతో స్వాగతం ముందు నడవగా రథాలు ముందుకు కదలాయి. గ్రామ బొడ్రాయి వరకు లాగి యథాస్థానానికి చేర్చారు. సర్పంచ్‌లు చంద్రశేఖర్, జానకమ్మ పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా మండల కేంద్రంలో వెలసిన సిద్ధారూఢస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు శనివారం తెలిపారు.

కమనీయం..శాంతమల్లప్ప కల్యాణం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని చిన్మయ మిషన్ బ్రహ్మచారి నారాయణచైతన్య, సభ్యుల ఆధ్వర్యంలో శనివారం శ్రీశాంతమల్లేశ్వరస్వామి, శాంత భ్రమరాంబదేవి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. సంప్రదాయబద్ధంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అయ్యవారు, అమ్మవార్ల కల్యాణోత్సవం భక్తుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఓం నమఃశివాయ నామస్మరణతో మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా పులిగట్టు ఆంజనేయస్వామి ఉత్సవాలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ఒకటైన ఏరిగేరి గ్రామంలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. గ్రామానికి కిలో మీటరు దూరంలోని కొండల్లో వెలసిన స్వామిని



ప్రత్యేక అలంకరణలో చంద్రమౌళేశ్వరస్వామి



కల్యాణం అనంతరం ఉత్సవమూర్తులు



విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

నిండా భక్తులే కనిపించారు. ఆదివారం సాయంత్రం పల్లకోత్సవం ఉంటుందని, కొండపై నుంచి వాయిద్యాల నడుమ, భక్తుల కోలాటల మధ్య కిందకు దిగి రాత్రంత గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి సోమవారం ఉదయం స్వామి కట్టాకు చేరడంతో ఉత్సవం ముగుస్తుందని నిర్వహకులు తెలిపారు.

వైభవం.. స్వామివారి రథోత్సవం

ఆదోనిరూరల్: మండలంలోని దొడ్డనగేరి గ్రామంలో శివపార్వతుల రథోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. ముందుగా శివపార్వతుల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి రథోత్సవం వేడుకగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



దొడ్డనగేరిలో రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

రమణీయం.. జెట్టెప్పతాత రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కౌతాళం: మండలంలోని రౌడూరు గ్రామంలో వెలసిన జెట్టప్పతాత, లక్ష్మన్నతాత, శంకరప్ప తాతల ఉత్సవాలను శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్వాముల వారి 67వ జాతర సందర్భంగా 150 గండాదీపాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పిండివంటలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా స్వాముల వారి పల్లకీని గ్రామంలో ఊరేగించి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. సాయంత్రం స్వాముల వారి పల్లకీ ముందుకు సాగగా జెట్టప్పతాత రథోత్సవం వందలాది మంది భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ముందుకు సాగింది. వేడుకను తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచే గాక కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును చేపట్టారు.

స్వామి వారికి తులాభారం..

రథోత్సవం అనంతరం జెట్టప్పతాత మఠం ధర్మకర్త వీరభద్రస్వామికి భక్తులు తులాభారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏలా లాగే చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో జెట్టెప్పతాత

రాతిదూలం లాగుడు పోటీలు

జాతర సందర్భంగా గ్రామంలో ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలను మఠం ధర్మకర్త వీరభద్రప్ప తాత ఆధ్వర్యంలో ప్రారంభించారు. విజేతగా నిలిచిన ఎద్దుల యజమానులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు.



ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంత్రాలయం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని వగరూర్ గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్‌ను పంపిణీ చేశారు. ముందుగా మైనార్టీ కాలనీ, వాల్మీకి, ఎస్సీ, బీసీ కాలనీల్లో రూ.40 లక్షలతో మంచి నీటి పైప్‌లైన్, రోడ్లు, రూ.3.50లక్షలతో ఎస్సీ కాలనీలో ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం జగనన్న కాలనీకి చెందిన 96 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. సర్పంచ్ లింగారెడ్డి, ఎంపీటీసీ చిన్నన్న పాల్గొన్నారు.